హిట్లర్ ఫాసిజాన్ని సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించింది ఎర్రజెండానే..

- ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద చర్యలను అడ్డుకోవాలి
- భారత్, పాకిస్తాన్ దాడుల సమయంలో అందాల పోటీలా? : జాన్‌వెస్లీ
- 20న దేశవ్యాప్త సమ్మెకు, 30న వ్యకాస ధర్నాలకు సిపిఎం మద్దతు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రష్యాలో హిట్లర్ ఫాసిజాన్ని, సామ్రాజ్యవాదాన్ని మట్టి కరిపించి ఎర్రజెండా ఎగిరిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తెలిపారు. ప్రపంచ దేశాలను ఆక్రమించుకోవాలన్న హిట్లర్ దూకుడుకు ఎర్రజెండా అడ్డుకట్ట వేసిందన్నారు. రష్యాలో అడుగు పెట్టకుండా సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం అడ్డుకొని కమ్యూనిస్టు నాయకత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చిందని గుర్తు చేశారు. సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం విజయం సాధించి 80 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని పాషా, నరహరి స్మారక కేంద్రంలో సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడారు. నియంత హిట్లర్ ప్రపంచంలోనే ఒక్కొక్క దేశాన్ని ఆక్రమించుకుంటూ రష్యాను కూడా ఆక్రమించుకునేందుకు చేసిన ప్రయత్నాన్ని 1945లో సోవియట్ యూనియన్, కమ్యూనిస్టు పార్టీల ఎర్రసైన్యం అడ్డుకట్ట వేశాయన్నారు. కమ్యూనిజాన్ని లేకుండా చేస్తాడని సామ్రాజ్యవాద దేశాలు, పెట్టుబడిదారులు.. హిట్లర్ నాజీయిజాన్ని పెంచి పోషించాయని తెలిపారు. ఆయన్ను ప్రోత్సహించి రష్యా, సోవియట్ యూనియన్ మీద దాడి చేయించడానికి పూనుకున్నాయన్నారు. స్టాలిన్ నాయకత్వాన రెండు కోట్ల మంది ప్రజలు, సైన్యం తిరుగుబాటు చేయగా.. 30 లక్షల మంది కమ్యూనిస్టు కార్యకర్తలు ప్రాణాలు కోల్పోయారని గుర్తుచేశారు ఈపోరాటంలో 20 లక్షల మంది యూదులను ఊచకోత కోశారని తెలిపారు. అయినా రష్యా ప్రజలు పోరాట శక్తిని ప్రదర్శిస్తూ హిట్లర్ ఫాసిజాన్ని ఓడించి జర్మనీలోని బెర్లిన్ నగరానికి హిట్లర్‌ను తరిమికొట్టి అక్కడ ఎర్రజెండా ఎగురవేశారని వివరించారు. ఎర్రజెండాను కనుమరుగు చేయాలనుకోవడం కాదన్నారు.


సెమినార్‌లో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ఎర్రజెండా నాయకత్వంలో కార్మికులు, ప్రజలు కొట్లాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని మోడీ ప్రభుత్వం కాలరాస్తోందన్నారు. మళ్ళీ 12 గంటల పని విధానాన్ని తీసుకువచ్చారని, సంఘాలు, సమ్మె హక్కులు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతు ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వెలిబుచ్చారు. ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించాలన్నారు. నిరుద్యోగం పెరుగుతోందని, విద్యా వైద్యం అందడం లేదన్నారు. హిట్లర్‌నే ఓడించిన శ్రామిక వర్గం, ప్రజలు.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నియంతృత్వ విధానాలను సైతం ఓడిస్తారని హెచ్చరించారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలను అమలు చేయడం లేదన్నారు. రాష్ట్రం అప్పులతో దివాళా తీసిందని చెప్తున్న ముఖ్యమంత్రికి ఎన్నికల ముందు ఈ విషయం తెలియదా అని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వస్తే అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామని హామీలిచ్చారని, వాటిని అమలు చేయకపోతే తగిన గుణపాఠం చెప్పక తప్పదన్నారు. ఉగ్రవాద చర్యలను సిపిఎం ఖండిస్తోందన్నారు. భారత్, పాకిస్తాన్‌కు మధ్య యుద్ధం కొనసాగుతుండగా ఆర్థిక సంక్షోభం వచ్చే ప్రమాదం ఉందన్నారు. ప్రపంచ దేశాలు సమైక్యంగా ఉగ్రవాదాన్ని అణచివేసి.. శాంతిని నెలకొల్పే ప్రయత్నం చేయాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా శ్రామిక వర్గాన్ని, ప్రజలను చైతన్యం చేస్తూ, శ్రామికవర్గ పోరాటాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు.

అందాల పోటీలు అవసరమా..?

ఓ వైపు భారత్, పాకిస్తాన్ మధ్య దాడులు కొనసాగుతుండగా హైదరాబాద్‌లో అందాల పోటీలు నిర్వహించడం సరికాదని జాన్‌వెస్లీ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యలను దేశ ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి కల్పించొద్దని ప్రభుత్వానికి సూచించారు. వెంటనే హైదరాబాద్‌లో జరగాల్సిన అందాల పోటీలను రద్దు చేయాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం మద్దతు..

ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెకు సిపిఎం సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు జాన్‌వెస్లీ ప్రకటించారు. అదే విధంగా ఈనెల 30న రాష్ట్రంలోని అన్నీ జిల్లాల కలెక్టరేట్ల ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం చేపట్టే ధర్నాలకు సైతం మద్దతు ప్రకటించారు. రైతులు, కూలీలు, వ్యవసాయ కార్మికులు, కార్మిక వర్గం ఈ ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కాడిగళ్ల భాస్కర్, సామెల్, జగదీష్, ఈ.నర్సింహ, జగన్, చంద్రమోహన్, జిల్లా కమిటీ సభ్యులు ఆలంపల్లి నర్సింహ, శ్యామ్ సుందర్, కీసర సర్సిరెడ్డి, కిషన్, గోరెంకాల నర్సింహ, పి.జగన్, సుమలత, ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యదర్శి ఎల్లేష్ పాల్గొన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో హై అలెర్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణను పెంచారు. 24 గంటల పాటు డేగ కళ్లతో విమానాశ్రయానికి భద్రత కల్పిస్తున్నారు. స్థానిక శాంతి భద్రతల విభాగం, ఇంటెలిజెన్స్, ఎస్‌బీ పోలీసుల సమన్వయంతో విమానాశ్రయానికి భద్రత కల్పించారు. విమానాశ్రయం చుట్టూ ఏర్పాటు చేసిన సిసి కెమెరాల ద్వారా భద్రతను పర్యవేక్షిస్తున్నారు. ప్రయాణికులు 3 గంటల ముందే విమానాశ్రయానికి చేరుకోవాలని అధికారులు సూచించారు. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలతో ప్రయాణికులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి శ్రీనగర్, అమృత్‌సర్, జోధ్‌పుర్, చండీగఢ్, రాజ్‌కోట్ వెళ్లే విమాన సర్వీసులను అధికారులు రద్దు చేశారు.కాగా, శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి శుక్రవారం రాత్రి బాంబు బెదిరింపు వచ్చింది. విమానాశ్రయంలో బాంబు పెట్టినట్లు అధికారులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, సిఐఎస్ఎఫ్ సిబ్బంది డాగ్, బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. ఇది ఫేక్ బెదిరింపు ఇ - మెయిలా? ఎక్కడి నుంచి వచ్చింది? ఎవరు పెట్టారనే కోణంలోనూ అధికారులు విచారణ చేస్తున్నారు.

విర్రవీగిన హిట్లర్ ఏమైండు?

- కార్మికవర్గం కష్టజీవులు ఐక్యం కావాలి
- నయాఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటాలు : ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ భూ మండలంపైన్నే ఎర్రజెండా లేకుండా చేస్తానని విర్రవీగిన హిట్లర్ చివరకు ఆ జెండా దెబ్బకు ఆత్మహత్య చేసుకున్నాడని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య ఎద్దేవాస్తూచేశారు. 'సమకాలిన పరిస్థితులు-సవాళ్లు' అంశంపైశుక్రవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పార్టీ హైదరాబాద్ సిటీ సెంట్రల్ కమిటీ ఆధ్వర్యంల్లో సిటీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎం వెంకటేశ్ అధ్యక్షతన సెమినార్ నిర్వహించారు. ఫాసిజంమీద సోవియట్ యూనియన్ సాధించిన విజయం సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ ఫాసిజంమీద సోవియట్ యూనియన్ ఎర్రసైన్యం విజయం సాధించటం, బెర్లిన్ కోటపై ఎర్రజెండా ఎగిరేయడంతో హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. దాంతో ప్రపంచం ఊపిరి పీల్చుకుందని గుర్తు చేశారు. 1920వ దశకంలో నెలకొన్న తీవ్ర ప్రపంచ ఆర్థిక మాంద్యాన్ని అధిగమించడానికి, రాజ్యాధికారంపై ఆధిపత్యం నిలబెట్టుకోవడానికి పాలక శక్తులు ఫాసిజాన్ని ఆశ్రయించాయన్నారు. ప్రపంచవ్యాపంగా అనేక దేశాల్లో కార్మికవర్గ పోరాటాలు వెల్లువెత్తి, కమ్యూనిస్టు ఉద్యమాలు ఉధృతంగా పెరుగుతూ వచ్చాయని వివరించారు. ఆర్థిక సంక్షోభ కాలంలో కార్మిక వర్గానికి నాయకత్వం వహించిన కమ్యూనిస్టు పార్టీలు అధికారం చేజిక్కించుకోకుండా చూడడానికి పాలక శక్తులు రకరకాల ఫాసిస్టు ఎత్తుగడలను అవలంభించాయని చెప్పారు. ఇటలీలో ముస్సోలిని, జర్మనీలో హిట్లర్, జపాన్‌లో హిరోహితోలు ఫాసిస్టు శక్తులకు ప్రాతినిధ్యం వహించారని వివరించారు. ఆయా దేశాల్లో ఫాసిజం తలెత్తడానికి దేశీయ బూర్జువా వర్గంతో పాటు ఇంగ్లాండ్, అమెరికా, ఫ్రాన్స్ వంటి పెట్టుబడిదారీ దేశాల్లోని బూర్జువావర్గం కూడా ఎంతగానో తోడ్పడిందన్నారు ఫాసిజం అంటే 'కార్మికవర్గ విప్లవాలకు బెదిరి ఫైనాన్స్ పెట్టుబడి బాహటంగా ఉగ్రవాద నియంతృత్వానికి పాల్పడడం' అని కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ నాయకుడు, ఫాసిస్టు వ్యతిరేక యోధుడు అయిన జార్జి డెమిట్రోవ్ నిర్వచించాడని గుర్తు చేశారు. హిట్లర్ ఫాసిజాన్ని తిప్పికొట్టడానికి 'ఫ్రంట్' కడదాం రమ్మని స్టాలిన్ ప్రతిపాదించినపుడు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ దేశాలు గట్టిగా తిరస్కరించాయని వివరించారు. హిట్లర్ తన సైన్యాన్ని ఫ్రాన్స్ మీదకు నడిపించి ఆ దేశాన్ని ఓడించి, బ్రిటన్‌ను బెదిరించిన తర్వాత ఆ దేశాలు కళ్లు తెరిచాయన్నారు. అయినా 'ఫాసిజానికి వ్యతిరేకంగా కలిసి పోరాడుదాం' అని స్టాలిన్ పదేపదే చేసిన ప్రతిపాదనలను నిర్లక్ష్యం చేశాయని చెప్పారు. సోషలిస్టు రష్యాను హిట్లర్ ఓడించి తీరతాడన్న ఆశలు పెట్టుకున్నాయనీ, ఈ ఆశలతోనే ఫాసిజంపై రెండవ దిక్కు నుంచి సాగించాల్సిన యుద్ధాన్ని అమెరికా, ఇంగ్లాండ్, ఫ్రాన్స్ దేశాలు రెండేండ్లు ఆలస్యంగా మొదలుపెట్టాయని చెప్పారు. ఇన్ని ఆటంకాల మధ్య హిట్లర్ నాజీ సైన్యాన్ని ఎదుర్కొని, ఫాసిజాన్ని మట్టి కరిపించడంలో సోషలిస్టు రష్యా కీలక పాత్ర పోషించిందని చెప్పారు. ఈ యుద్ధంలో 2 కోట్ల మంది రష్యన్లు అసువులు బాశారనీ, 30 లక్షల మంది కమ్యూనిస్టు పార్టీ సభ్యులు యుద్ధంలో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. వారి త్యాగాలను మర్చిపోలేమని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఫాసిస్టు ధోరణులు పెచ్చరిల్లడానికి దోహదం చేసే పరిస్థితులకు దారితీస్తున్న నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేయాలని వీరయ్య ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదానికి, నయా ఉదారవాద విధానాలకు, పాలక శక్తులు అనుసరిస్తున్న విద్వేష, విభజిత రాజకీయాలకు వ్యతిరేకంగా పోరాటాలకు సన్నద్ధం కావాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల మధ్య ఐక్యతను నెలకొల్పడం ద్వారా మాత్రమే ఫాసిజాన్ని ఓడించగలమని చరిత్ర మనకు చెబుతోందనీ, ఫాసిజం దాడులను తిప్పికొట్టడానికి కార్మికవర్గం, కష్టజీవుల ఐక్యత పునాదిగా సమాజంలోని వివిధ తరగతుల ప్రజానీకాన్ని విశాల ప్రాతిపదికన సమీకరించడమే మార్గమని చెప్పారు. సదస్సులో సీటీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాస్, ఎం. శ్రీనివాస్‌రావు, ఎం దశరథ్, మహేందర్, రాజన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఖాజాగూడలో సెర్టా షోరూం ప్రారంభం

హైదరాబాద్ :ప్రముఖ పరుపుల తయారీదారు సెర్టా తెలంగాణలో తన తొలి సెర్టా షోరూంను ఏర్పాటు చేసింది. నగరంలోని ఖాజాగూడలో ఏర్పాటు చేసిన దీనిని శుక్రవారం సెర్టా ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నితిన్ గుప్తా లాంచనంగా ప్రారంభించారు. వచ్చే 12 నెలల్లో హైదరాబాద్‌లో మరో ఐదు ప్రత్యేక షోరూంలు తెరువాలని లక్ష్యంగా పెట్టుకున్నామని నితిన్ గుప్తా తెలిపారు. రెండేళ్లలో భారత్‌లో 100 అవుట్‌లెట్‌లకు విస్తరించాలని నిర్దేశించుకున్నామన్నారు. వచ్చే ఏడాదిలో రూ.200 కోట్ల టర్నోవర్ అంచనా వేస్తోన్నామని తెలిపారు.

హైదరాబాద్‌లో జ్యువెలరీ ఫెయిర్ ప్రారంభం

హైదరాబాద్: ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా హైదరాబాద్‌లో 17వ జ్యువెలరీ పెర్ల్ అండ్ జెమ్ ఫెయిర్‌ను ఏర్పాటు చేసింది. హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను శుక్రవారం లాంచనంగా ప్రారంభించారు. దక్షిణాదిలో ముఖ్యమైన బి2బి ఆభరణాల వాణిజ్య వేదికగా దీన్ని ఏర్పాటు చేసింది. దేశ విదేశాల నుంచి వేలాది మంది ఆభరణాల వ్యాపారులు, డిజైనర్లు, తయారీదారులు, రిటైలర్లు ఇక్కడ తమ ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించారు. దీనికి 8 వేల మందికి పైగా వ్యాపారులు వస్తారని ఇన్ఫార్మా మార్కెట్స్ ఇన్ ఇండియా ఎండి యోగేష్ ముద్రాస్, సీనియర్ గ్రూప్ డైరెక్టర్ పల్లవి మెహ్రా, డైరెక్టర్ పంకజ్ షెండే తెలిపారు.

రేపు ఎప్‌సెట్ ఫలితాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఎప్‌సెట్ పరీక్షల ఫలితాలు ఆదివారం విడుదల కానున్నాయి. ఆదివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ లోని జూబ్లిహిల్స్ తన నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విడుదల చేయనున్నారు. ఈ మేరకు ఎప్‌సెట్ కన్వీనర్ బి డీన్‌కుమార్, కోకన్వీనర్ విజయ్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్‌సెట్ ఫలితాలతోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, ఇంజనీరింగ్ విభాగాల వారీగా ర్యాంకులను ప్రకటిస్తారు. గతనెల 29, 30 తేదీల్లో నిర్వహించిన ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలకు 86,762 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే 81,198 (93.59 శాతం) మంది హాజరయ్యారు. ఈ నెల రెండు, మూడు, నాలుగు తేదీల్లో ఎప్‌సెట్ ఇంజనీరింగ్ విభాగం పరీక్షలను నిర్వహించారు. ఈ విభాగానికి 2,20,117 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 2,07,190 (94.04 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు.

అధికారిక లాంఛనాలతో జవాన్ల అంత్యక్రియలు

- గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ అంతిమయాత్రలో మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్
- జవాన్ వడ్ల శ్రీధర్ అంతిమయాత్రలో మంత్రి పొన్నం ప్రభాకర్
- జవాన్ల ప్రాణత్యాగం వెలకట్టలేనిదన్న మంత్రులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆపరేషన్ కాగార్‌లో భాగంగా మూలుగు జిల్లా వాజేడు ప్రాంతంలో కుంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టులు అమర్చిన ల్యాండ్ మైన్ పేలడంతో ప్రాణాలు కోల్పోయిన జవాన్లు సందీప్, వడ్ల శ్రీధర్ అంత్యక్రియలు శుక్రవారం అధికారిక లాంఛనాలతో ముగిశాయి. దేశం కోసం, సమాజ సంరక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్స్ అమరులని మంత్రులు అన్నారు. జవాన్ల త్యాగం వెలకట్టలేనిదని, వారి సేవలు దేశానికి గర్వకారణమని తెలిపారు. మావోయిస్టులు చర్చల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలని, హింసామార్గాన్ని వీడనాడాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం ప్రభుత్వ లాంఛనాల ప్రకారం పోలీసులు మూడుసార్లు గాలిలో కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించి జవాన్ల అంత్యక్రియలు పూర్తిచేశారు.

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ అంబేద్కర్ నగర్‌కు చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ స్వగృహం వద్ద ఆయన భౌతికకాయానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ రావు, ఎంపి ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం, రాచకొండ సీపీ సుధీర్ బాబు.. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ సందీప్ కుటుంబానికి అండగా ఉంటామని, ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ.కోటి ఆర్థిక సాయంతో పాటు 300 గజాల స్థలం, సందీప్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం జరిగిన అంతిమయాత్రలో మల్కాజిగిరి ఎసిపి చక్రపాణి, ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పరశురాం.. సందీప్ పాడేమోసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో.. టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి, మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు సింగిరెడ్డి హరి వర్ధన్ రెడ్డి మృతదేహంపై పుష్ప గుచ్చాలు ఉంచారు. అ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్ రెడ్డి, బి బ్లాక్ అధ్యక్షుడు మహేష్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పావని జంగయ్య యాదవ్, కౌన్సిలర్లు బండారి ఆంజనేయులు గౌడ్, కడపొల్ల మల్లేష్, మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, నాయకులు బండారి శ్రీనివాస్ గౌడ్, ముత్యాలు యాదవ్, మహిపాల్ రెడ్డి, రాజేష్ ఆయా పార్టీల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రానికి చెందిన గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ జవాన్ వడ్ల శ్రీధర్ స్వగృహం వద్ద ఆయన భౌతికకాయానికి మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారిని ఓదార్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శ్రీధర్ కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. ఆయన కుటుంబానికి రూ.2.17 కోట్ల ఆర్థిక సహాయంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 300 గజాల ఇంటి స్థలాన్ని అందించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఎస్పీ రాజేష్, గ్రేహౌండ్స్ కమాండర్ ఆపరేషన్ రాఘవెందర్ రెడ్డి, అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, అదనపు కలెక్టర్ రెవెన్యూ వి.విక్టర్, ఆర్డీఓ వీణ, పోలీసు, రెవెన్యూ, అధికారులు, సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

బావిలో మునిగి ఒకరు.. కాపాడబోయి మరొకరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రమాదవశాత్తు ఒకరు కాలు జారి బావిలో పడి మునిగిపోతుండగా మరొకరు కాపాడబోయి ఇద్దరూ మృతి చెందిన ఘటన సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణపరిధిలో శుక్రవారం జరిగింది. హుజూర్‌నగర్ ఎస్ఐ జి.ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాకు చెందిన కన్మనూర్ తిరుపతయ్య, మేదిపురం లక్ష్మణ్ (21).. మరో ఆరుగురితో కలిసి వారి స్వగ్రామం నుంచి గొర్రెలను మేపుకుంటూ హుజూర్‌నగర్ పట్టణానికి వచ్చారు. పది రోజుల నుంచి హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన జక్కుల లింగయ్య పొలంలో మేత కోసం గొర్రెలను ఆపి ఆ పొలంలోనే ఉంటున్నారు. నాలుగు రోజుల క్రితం తిరుపతయ్య ఇద్దరు కుమారులు శేఖర్ (14), చరణ్.. వేసవి సెలవులు అయినందున తండ్రి వద్దకు వచ్చారు. శుక్రవారం ఉదయం తిరుపతయ్య పెద్ద కుమారుడు శేఖర్, లక్ష్మణ్.. సమీపంలోని లింగయ్య బావిలో నీళ్లకోసం వెళ్లారు. లక్ష్మణ్ నీళ్లు పట్టడానికి ప్రయత్నిస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి బావిలో పడి మునుగుతుండగా, శేఖర్ అతన్ని కాపాడటానికి ప్రయత్నిస్తుంచి.. అతను కూడా బావిలో పడ్డాడు. దాంతో ఇద్దరూ నీట మునిగి చనిపోయారు. శేఖర్ తండ్రి తిరుపతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఇండియా ప్రతిదాడి సరైన చర్యే

- ఇష్టాగోష్టిలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జమ్మూకశ్మీర్‌పై పాకిస్తాన్ చేసిన దాడికి ఇండియన్ ఆర్మీ ప్రతిదాడి చేయడం సరైన చర్యే అని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇరుదేశాల యుద్ధం కొనసాగితే పాకిస్తాన్ పతనమవుతుందని అభిప్రాయపడ్డారు. మూడో దేశం ఏదీ కూడా యుద్ధం చేయడానికి ముందుకు రాకపోవచ్చని తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన శుక్రవారం విలేకర్లతో ఇష్టాగోష్టిలో మాట్లాడారు. భారత్ బోర్డర్ నుంచే రాఫెల్ యుద్ధ విమానాలు పని చేశాయన్నారు. కాశ్మీర్ విషయంలో ఒక చర్య జరిగితే తప్పా రెండు దేశాల మధ్య సమస్య పరిష్కారం కాదన్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను ఇండియా పరం చేస్తేనే ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. పూర్తిస్థాయి యుద్ధం జరిగి, తన అవసరం అనిపిస్తే పాకిస్తాన్‌పై పోరాడుతానని చెప్పారు. ఏప్రిల్ 22న జరిగిన దాడికి పాకిస్తాన్ ప్రేరేపిత చర్యే కారణమని చెప్పారు. ఉగ్రవాదులు మతం పేరు అడిగి చంపడం అన్యాయమన్నారు. ఈ ఘటనపై కశ్మీర్‌తోసహా దేశమంతా ఏకతాటిపైకి వచ్చి ఆ ఘటనను ఖండించారని ఆయన గుర్తు చేశారు. ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ సమయంలో కాంగ్రెస్ పార్టీని కొంత మంది డ్యామేజ్ చేయాలని ప్రయత్నించారని విమర్శించారు. ఆపరేషన్ సిందూర్‌కు కాంగ్రెస్ వ్యతిరేకమన్నట్టు ప్రచారం చేయడాన్ని ఖండించారు. ఆ సమయంలో ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, పార్టీ నేత ప్రతాప్‌సింగ్ ఫోటోలతో దూరదర్శన్ ప్రసారం చేసిందని విమర్శించారు. ఆ చానల్‌పై ఎఐసిసి పరువు నష్టం దావా వేసిందని గుర్తు చేశారు.



విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదుల దౌర్జన్యాలను యువతరం ప్రతిఘటించాలనీ, ఈ నెల20న జరుగు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో సామాజిక శక్తులు కార్మికులతో కలిసి పాల్గొనాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశంలో ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు పాల్గొన్ని ప్రసంగించారు. మనువాద కార్పొరేట్ విధానాలతో దేశంలో మత విద్వేషాలు పెట్రేగిపోతున్నాయని, అమాయక యువతరం బలవుతున్నారని తెలిపారు. దళితులపై 300 రేట్లు దౌర్జన్యాలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. మరోవైపు కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ అసమానతలను పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. విద్వేషాలతో ప్రజల మధ్య అభద్రత ఏర్పడుతున్నదని తెలిపారు. రాజ్యాంగ రక్షణ ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున, ఎం కురుమయ్య, అతిమెల మాణిక్యం, నందిపాటి మనోహర్, అరూరి కుమార్, పల్లెర్ల లలిత, ఎం ప్రకాశ్ కరత్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు డి రాధాకృష్ణ తిప్పారపు సురేష్, కోట గోవి, బొట్ల శేఖర్, డి రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో 800 పోస్టుల భర్తీకి మంత్రి అనుమతి

- ఆరోగ్యశ్రీ ప్రోత్సాహకానికి ఓకే చెప్పిన దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మక నిమ్స్‌లో 800 పోస్టులు భర్తీ చేసేందుకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అనుమతించారు. ఈ పోస్టుల్లో డాక్టర్లు, నర్సులు సహా పలు రకాల కేడర్లవి ఉన్నాయి. అదే విధంగా పదేళ్ల నుంచి ఎదురుచూస్తున్న ఆరోగ్యశ్రీకి ప్రోత్సాహం ఇచ్చేందుకు మంత్రి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి అధ్యక్షతన నిమ్స్ ఎగ్జిక్యూటివ్ బోర్డు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.బీరప్ప, నిమ్స్ 2024-25లో రోగులకు అందించిన సేవల వివరాలతో కూడిన ప్రగతి నివేదికను మంత్రికి అందజేశారు. ఓపీ, ఐపీ పెరిగిందనీ, ఏడాదిలో పెద్ద సంఖ్యలో రోబోటిక్ సర్జరీలు నిర్వహించినట్టు ఆయన తెలిపారు. మెరుగైన సేవలందించిన డాక్టర్లు, సిబ్బందిని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. నిమ్స్ ప్రతిపాదన ఆరోగ్యశ్రీకి ప్రోత్సాహకాన్ని ఇచ్చేందుకు ఒకే చెప్పడంతో ఇక నుంచి ఆరోగ్యశ్రీ నుంచి వచ్చే డబ్బుల్లో డాక్టర్లు, వైద్య సిబ్బందికి 35 శాతం అందించనున్నారు. ఈ సందర్భంగా బీరప్ప మాట్లాడుతూ 2023లో కంటే 2024లో అవుట్ పేషెంట్ల సంఖ్య 12.6 శాతం, ఆరోగ్యశ్రీ కింద రోగుల సంఖ్య 22.4 శాతం పెరిగిందని తెలిపారు. ఎల్వోసీ కింద 2023లో 5,800 మందికి చికిత్స అందిస్తే, 2024లో ఆ సంఖ్య 11 వేలకు పెరిగిందని చెప్పారు. గతేడాదిలో దాదాపు 350 రొబొటిక్ సర్జరీలు చేశామన్నారు. నిమ్స్‌లో రోగుల సంఖ్య పెరుగుతున్నందున అందుకు అనుగుణంగా డాక్టర్లు, స్టాఫ్‌ను నియమించుకునేందుకు అనుమతించాలని మంత్రిని కోరారు.నిమ్స్ కొత్త భవనాల నిర్మాణ పనులపై మంత్రి ఆరా తీశారు. భవనాల నిర్మాణ పనుల ప్రగతిని మంత్రికి అధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాణ్యతలో రాజీపడకుండా, వీలైనంత వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనులపై త్వరలోనే పూర్తి స్థాయిలో సమీక్షిస్తాననీ, అన్ని వివరాలతో రావాలని అధికారులకు సూచించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ మరింత మెరుగైన వైద్యసేవలందించాలని సూచించారు. ఎమర్జెన్సీ విభాగం నుంచి వీలైనంత త్వరాగా సంబంధిత వార్డుకు పేషెంట్లను షిఫ్ట్ చేయాలన్నారు. తద్వారా ఎమర్జెన్సీలో వచ్చిన ఇతర పేషెంట్లకు బెడ్ ఇవ్వడం సులువు అవుతుందన్నారు. పేషెంట్లను ఎక్కువసేపు అంబులెన్స్‌లో ఉంచొద్దని, వచ్చిన వెంటనే లోపలకు తీసుకోవాలని ఆదేశించారు. అంతర్గత కలహాలతో నిమ్స్ ప్రతిష్టను దెబ్బతీసేలా వ్యవహరించేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు. ఈ సమావేశంలో హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చొంగ్తూ, ఆర్థికశాఖ డిప్యూటీ సెక్రటరీ శైలజ, నిమ్స్ డీన్ డాక్టర్ లిజా రాజశేఖర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

దలాల్ స్ట్రీట్‌ను వెంటాడిన ఉద్రిక్తతల భయాలు

- సెన్సెక్స్ 880 పాయింట్ల పతనం

ముంబయి : భారత్, పాక్ సరిహద్దు ప్రాంతాల్లో నెలకొన్న ఉద్రిక్తతలు దలాల్ స్ట్రీట్‌ను రెండో రోజూ నష్టాలకు గురి చేశాయి. పాక్ దాడులను భారత్ సమర్థంగా తిప్పికొడుతు న్నప్పటికీ.. ఈ యుద్ధ తీవ్రత పెరగొచ్చనే అంచనాల్లో మార్కెట్లు కుప్పకూలాయి. ఈ నేపథ్యం లోనే శుక్రవారం బిఎస్ఇ సెన్సెక్స్ 880.34 పాయింట్లు లేదా 1.10 శాతం పతనమై 79,454.47 కు పడిపోయింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 265.80 పాయింట్లు లేదా 1.10 శాతం నష్టంతో 24,008 వద్ద ముగిసింది. ఉద్రిక్తతల నేపథ్యంలో విమానయానం, టూరిజం, రియాల్టీ షేర్లు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. మరోవైపు రక్షణ రంగ షేర్లు రాణించాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ సూచీ యథాతథంగా నమోదు కాగా.. స్మాల్‌క్యాప్ సూచీ 0.61 శాతం నష్టపోయింది. సెన్సెక్స్ 30లో 25 స్టాక్స్ నేల చూపులు చూశాయి. ఐసిఐసిఐ బ్యాంక్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లు అధిక నష్టాలను చవి చూశాయి. టైటాన్, టాటా మోటార్స్, ఎల్అండ్‌టి, ఎస్‌బిఐ, ఏషియన్ పెయింట్స్ షేర్లు లాభపడ్డాయి. డ్రోన్ల తయారీ కంపెనీ ఐడియా ఫోర్జ్ షేర్లు ఏకంగా 18 శాతం లాభపడ్డాయి. నిఫ్టీలో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, రియాల్టీ రంగాలు 1 శాతం పైగా నష్టపోయాయి. రియాల్టీ ఏకంగా 2 శాతం కోల్పోయింది. ఐటి, ఎనర్జీ, ఫార్మా, ఎఫ్ఎంసిజి, హెల్త్‌కేర్, ఆయిల్ అండ్ గ్యాస్ సూచీలు నష్టాలను చవి చూశాయి. ప్రభుత్వ బ్యాంక్‌లు, కన్స్యూమర్ డ్యూరెబుల్స్, లోహ, మీడియా, సూచీలు లాభాల్లో ముగిశాయి.

కెనరా రోబెకో నుంచి కొత్త ఫండ్

ముంబయి : దేశంలో రెండో పూరతనమైన మ్యూచువల్ ఫండ్ కెనరా రోబెకో కొత్తగా కెనరా రోబెకో మల్టీ అసెట్ అలోకేషన్ ఫండ్‌ను ఆవిష్కరించింది. మార్కెట్ ఒడిదుడుకులు ఉన్న కాలాల్లో నష్ట భయాన్ని తగ్గించడం లక్ష్యంగా ఈ ఫండ్‌ను డిజైన్ చేసినట్లు పేర్కొంది. ఈ కొత్త ఫండ్ మే 9న సబ్‌స్క్రిప్షన్ కోసం తెరిచినట్లు పేర్కొంది. మే 23న ముగుస్తుందని వెల్లడించింది. ఇందులోని నిధులను 65-80 శాతం ఈక్విటీల్లో, మరో 10-25 శాతం గోల్డ్, సిల్వర్ ఇటిఎఫ్‌ల్లో పెట్టుబడిగా పెట్టనున్నట్లు పేర్కొంది.


ఎఫ్ఎంసిజి అమ్మకాల్లో మందగమనం

- మార్చి త్రైమాసికంలో 5.1 శాతం పతనం

న్యూఢిల్లీ : రోజువారి అవసరాల కోసం అత్యంత ఎక్కువగా ఉపయోగించే ఎఫ్ఎంసిజి అమ్మకాలు మందగించాయి. ప్రస్తుత ఏడాది మార్చితో ముగిసిన త్రైమాసికంలో వీటి విక్రయాలు ఏకంగా 5.1 శాతం క్షీణించాయని నీల్సన్‌ఐక్యూ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. పానియాలు, కస్మోటిక్స్, ప్యాకేజింగ్ ఫుడ్, క్లీనింగ్ ఉత్పత్తులు, పెన్నులు, పెన్సిళ్లు తదితర ఉత్పత్తులు ఎఫ్ఎంసిజి రంగంలోకి వస్తాయి. తక్కువ విలువ కలిగి ఎక్కువగా అమ్ముడయ్యే ఈ ఉత్పత్తుల అమ్మకాలు 2024 ఇదే మార్చి త్రైమాసికంలో 6.1 శాతం వృద్ధిని సాధించాయి. గడిచిన ఐదు త్రైమాసికాల నుంచి వీటి వృద్ధి సన్నగిల్లిందని నీల్సన్ రిపోర్ట్ పేర్కొంది. గ్రామీణ మార్కెట్ పట్టణ మార్కెట్ కంటే వేగంగా వద్ధి చెందుతూనే ఉంది. ఈ మార్కెట్ పట్టణాల కంటే గ్రామీణంలో ఎక్కువగా పెరుగుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనూ అమ్మకాలు అంతంత మాత్రంగానే నమోదయ్యాయి. "2024 తొలి త్రైమాసికంలోని డిమాండ్‌తో పోల్చితే 2025 ప్రథమ త్రైమాసికంలో గ్రామీణ వినియోగదారుల డిమాండ్ స్వల్పంగా పెరిగింది. పట్టణ మార్కెట్లతో పోల్చితే గ్రామీణ మార్కెట్లే మెరుగ్గా ఉన్నాయి. ముఖ్యంగా ద్రవ్యోల్బణం పెరుగుదల, మార్కెట్లలో మార్పుల వల్ల చిన్న సంస్థలు, అన్‌బ్రాండెడ్ సంస్థలు రెండంకెల వృద్ధిని నమోదు చేశాయి. ఏడాదికేడాదితో పోల్చితే గడిచిన మార్చి త్రైమాసికంలో అహార వినియోగ వృద్ధి 6 శాతం నుంచి 4.9 శాతానికి పడిపోయింది. గృహ, వ్యక్తిగత సంరక్షణ విభాగం అమ్మకాల్లో 5.7 శాతం పెరుగుదల చోటు చేసకుంది. అయితే.. గతేడాది మార్చి త్రైమాసికంలో 10.8 శాతం వృద్ధితో పోల్చితే చాలా తక్కువ." అని నీల్సన్‌ఐక్యూ రిపోర్ట్ పేర్కొంది.

త్వరలో ఐదువేల మంది లైసెన్స్‌ సర్వేయర్లు

- శిక్షణ కోసం ఈ నెల 17 లోగా దరఖాస్తు చేసుకోవాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి



జర్నలిస్టు బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

రాష్ట్రంలో భూ వివిధాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో త్వరలో ఐదు వేల మంది లైసెన్స్‌ సర్వేయర్లను నియమిస్తున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌ రెడ్డి తెలిపారు. శుక్రవారం సచివాలయంలో సర్వే, సెటిల్మెంట్‌, ల్యాండ్‌ రికార్డ్స్‌ శాఖపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. భూ భారతి చట్టంలో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు భూమి మ్యాపును జత పర్చడం తప్పనిసరి చేసిన నేపథ్యంలో సర్వే విభాగంలో ప్రస్తుతమున్న 402 మంది సర్వేయర్లు సరిపోరని అభిప్రాయపడ్డారు. ఈ క్రమంలో లైసెన్స్‌ సర్వేయర్లను తీసుకోవడంతో పాటు మరోవైపు సర్వే విభాగంలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయనున్నట్టు తెలిపారు. సర్వే విభాగానికి అవసరమైన అత్యాధునిక పరికరాలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. లైసెన్స్‌ సర్వేయర్ల శిక్షణకు అర్హత కలిగిన అభ్యర్థులనుంచి ఈ నెల 17వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు మంత్రి వివరించారు.. ఐటిఐ డ్రాఫ్ట్స్‌ మన్‌, డిప్లొమా, బీటెక్‌ (సివిల్‌) లేదా ఇతర సమానమైన విద్యార్హత కలిగినవారు అర్హులని పేర్కొన్నారు. అలాగే ఇంటర్మీడియట్‌ (గణిత శాస్త్రం) ఒక అంశంగా ఉండి, కనీసం 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు కూడా అర్హులని తెలిపారు. శిక్షణ ఫీజు ఒసి అభ్యర్థులకు రూ.పది వేలు, బిసి అభ్యర్థులకు రూ.ఐదు వేలు, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు రూ.2,500 చెల్లించవలసి ఉంటుందని వివరించారు. ఎంపికైన అభ్యర్థులకు జిల్లా ప్రధాన కేంద్రాల్లో 50 పని దినాల్లో తెలంగాణ అకాడమీ (ల్యాండ్‌ ఇన్ఫర్మేషన్‌ మేనేజ్‌మెంట్‌) ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వబడుతుందని తెలిపారు. మొత్తం ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి వీలైనంత త్వరగా లైసెన్స్‌ సర్వేయర్ల సేవలను అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ముఖ్య కార్యదర్శి నవీన్‌ మిట్టల్‌, కమిషనర్‌ ఆఫ్‌ సర్వే, సెటిల్మెంట్‌, ల్యాండ్‌ రికార్డ్స్‌ జ్యోతి బుద్ధప్రకాష్‌, సిసిఎల్‌ఎ ప్రాజెక్టు డైరెక్టర్‌ ఎం.మకరందు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు : మంత్రి పొంగులేటి

అర్హులైన జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్‌, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలైన జర్నలిస్టులతోపాటు వృత్తి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టుల కుటుంబాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. వృత్తిజీవితంలో మరణించిన జర్నలిస్టుల కుటుంబాలు, తీవ్ర అనారోగ్యం, ప్రమాదాలకు గురై వృత్తి నిర్వహించలేని స్థితిలో ఉన్న జర్నలిస్టులకు శుక్రవారం నాంపల్లిలోని ప్రెస్‌ అకాడమీ కార్యాలయంలో చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండల, నియోజకవర్గ స్థాయిలో పని చేస్తున్న జర్నలిస్టులను ఆదుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మంచిని మంచిగా, నిజాన్ని నిర్భయంగా సమాజానికి తెలియజేసే దాంట్లో ఎంతో మంది జర్నలిస్టులు ఆణిముత్యాలుగా పనిచేస్తున్నారని ప్రశంసించారు. జర్నలిస్టు వృత్తిపై ఆధారపడి తన జీవితం మొత్తం ఆ జర్నలిజానికే అంకితమైనవాళ్లు ఎంతోమంది ఉన్నారని అన్నారు. ఆనాటి ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన ప్రెస్‌ అకాడమీ భవనాన్ని చిన్న చిన్న మరమ్మత్తులు పూర్తి చేసుకుని ఈ నెల చివరిలోగా ప్రారంభిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.42.00 కోట్లను ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌ చేసి, దానిపై వచ్చే వడ్డీని జర్నలిస్టుల సంక్షేమం కోసం అకాడమి ఖర్చు పెడుతుందన్నారు. జర్నలిస్టుల సంక్షేమానికి ఫిక్స్‌డ్‌ డిపాజిట్‌పై వచ్చిన వడ్డీ ఆధారంగా ఇప్పటివరకు రూ.22 కోట్లు ఖర్చయ్యిందన్నారు. మరణించిన జర్నలిస్టుల కుటుంబాలకు చెందిన 597 మందికి రూ.1,00,000 పాటు ఐదేళ్ల వరకు, నెలకు రూ.3000 చొప్పున పెన్షన్‌, ట్యూషన్‌ ఫీజుల క్రింద ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదివే బాధిత జర్నలిస్టుల పిల్లలకు నెలకు రూ. 1,000 చొప్పున గరిష్టంగా ఇద్దరికి అందిస్తున్నట్టు చెప్పారు. ఇప్పటి వరకూ రూ.8,98,39,000 మేర ఆర్థిక సహాయం చేసినట్టు చెప్పారు. ఖమ్మం పార్లమెంట్‌ సభ్యులు రామసహాయం రఘురామరెడ్డి మాట్లాడుతూ ఈ సమాజంలో జర్నలిస్టు వృత్తి అత్యంత కీలకమైనదనీన్నారు. తమ ప్రాణాలను లెక్క చేయకుండా సమాచారాన్ని ప్రజలకు అందిస్తున్నారన్నారు. గడిచిన రెండ్రోజులుగా రెండు దేశాల మధ్య ఏం జరుగుతుందో అన్న ఆతతతో ఎదురుచూస్తున్న ప్రజలకు, సమాచారాన్ని జర్నలిస్టులు చేరవేస్తున్నారని కొనియాడారు. ప్రెస్‌ అకాడమీ చైర్మన్‌ కె శ్రీనివాస్‌ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని జర్నలిస్టుల సంక్షేమానికి నిధులను పెంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్‌ వినయ్‌ కృష్ణారెడ్డి, అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు, సమాచార శాఖ జెడి జగన్‌ తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక రంగ సేవా దక్షుడు కళా సుబ్బారావు

ప్రజాశక్తి కల్చరల్‌

నటులను గాయకులను నృత్య కళా కారులను ఇతర భిన్న కళా ప్రతిభావంతులను ప్రోత్సహించి సాంస్కృతిక రంగ సేవా దక్షుడు కళా సుబ్బారావు అని రాష్ట్ర శాసన మండలి ప్రతిపక్ష నాయకుడు సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై గాన సభ నిర్వహణలో గాన సభ పూర్వ అధ్యక్షుడు కళా సుబ్బారావు జయంతి వేడుకలు జరిగాయి ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సిరికొండ మధుసూదనాచారి సంప్రదాయ బద్ధంగా కళా సుబ్బారావు స్మారక పురస్కారం ప్రముఖ కవి రసమయి సాంస్కృతిక సంస్థ అధ్యక్షులు డాక్టర్‌ ఎం కె రాముకు బహూకరించి మాట్లాడారు జంట నగరాలలో ప్రసిద్ధి పొందిన గాన సభ ఆరంభకునిగా అధ్యక్షునిగా కళా సుబ్బారావు సుదీర్ఘ కాలం పాటు పని చేస్తున్న సమయంలో ఎందరో కళాకారులకు వేదిక కల్పించిన కారణ జన్ముడు అన్నారు. ప్రముఖులైన పేరొందిన భిన్న ప్రక్రియల కళా కారులను రప్పించి ప్రదర్శనలు ఇప్పించి గాన సభ పేరు ప్రఖ్యాతులు జగద్విదితం చేశారు అని వివరించారు. పురస్కార గ్రహీత రాము ఐదున్నర దశాబ్దాల పైగా రసమయి సంస్థ ద్వారా ఎన్నో నాణ్యవంత కార్యక్రమాలు నిర్వహిస్తూ ఇతర సాంస్కృతిక సంస్థలకు ఆదర్శంగా నిలిచారు అని అభినందించారు. శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్‌ మాట్లాడుతూ కళా సుబ్బారావు కళా పోషకుడు సౌజన్య శీలి అని చెప్పారు రాము ఉత్తమ లలిత గీతాలను ఎన్నో రాశారు అని ఆకాశవాణిలో ఆయన గీతలు ప్రజాదరణ పొందాయని గుర్తు చేశారు చారిత్రక నవలా రచయిత ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌ మాట్లాడుతూ సుబ్బారావు మంచి సాహితీ ప్రియులు అని ఆయన పేరిట పురస్కారం రాముకు బహుకరించటం సముచిత నిర్ణయం అన్నారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించి మాట్లాడుతూ తమ తండ్రి సుబ్బారావు వేసిన బాటలో గాన సభ ప్రతిష్ట కాపాడుతూ ఆయన సాంస్కృతిక సేవలు మార్గ దర్శనంగా తీసుకుని పని చేస్తున్నామని తెలిపారు పురస్కార గ్రహీత డాక్టర్‌ రాము మాట్లాడుతూ గాన సభ జంట నగరాలలోనే కాకుండా తెలుగు రాష్ట్రాల్లో పేరు పొందినది అని తెలిపారు. కళా సుబ్బారావుతో తనకు ఆత్మీయ అనుబంధమున్నదని గుర్తు చేసుకున్నారు. జనార్ధన మూర్తి గాన సభను మరింతగా అభివృద్ధి చేశారు అని అభినందించారు. వేదిక పై నోరి నరసింహ శాస్త్రి చారిటబుల్‌ ట్రస్ట్‌ వ్యవస్థాపకుడు సుబ్రహ్మణ్య శాస్త్రి మల్లాది భావన తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రం ఇచ్చేందుకు వచ్చిన హైదరాబాద్‌ సిటీజన్స్‌ ఫక్షరం బృందం

మెట్రో ఛార్జీల పెంపు ప్రజాప్రయోజనాలకు వ్యతిరేకం

- ఛార్జీల పెంపు ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలి
- హైదరాబాద్‌ సిటిజన్స్‌ ఫోరం

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

మెట్రో రైల్‌ ఛార్జీల పెంపు పూర్తిగా ఏకపక్షం, ప్రజా ప్రయోజనాలకు వ్యతిరేకం.. అన్యాయమని హైదరాబాద్‌ సిటిజన్స్‌ ఫోరం (హెచ్‌సిఎఫ్‌) ప్రధాన కార్యదర్శి వీరయ్య అన్నారు. మెట్రో రైల్‌ ఛార్జీలను పెంచే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్‌ చేశారు. శుక్రవారం హెచ్‌సిఎఫ్‌ ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం హెచ్‌ఎంఆర్‌ఎల్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ ఎన్‌విఎస్‌ రెడ్డిని కలిసి చర్చించారు. మెట్రో ఛార్జీల పెంపుదల వ్యవహారంలో హెచ్‌ఎంఆర్‌ఎల్‌కుగాని, ప్రభుత్వానికిగానీ ఎలాంటి సంబంధమూ లేదని, ఇది పూర్తిగా ఎల్‌అండ్‌టి సంస్థకు సంబంధించిన అంశమని తెలిపారు. అనంతరం హెచ్‌సిఎఫ్‌ ప్రతినిధి బృందం ఉప్పల్‌లోని ఎల్‌అండ్‌టి మెట్రో రైల్‌ హైదరాబాద్‌ సంస్థ కార్యాలయంలో మేనేజింగ్‌ డైరెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులో లేరు. మిగతా అధికారులు ఎవరూ వినతిపత్రం తీసుకునేందుకు సిద్ధంగా లేకపోవడంతో ఎల్‌అండ్‌టి కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. పిపిపి పద్ధతిలో ఒప్పందం చేసుకుని, ఛార్జీల పెంపులో తమకు ఎలాంటి సంబంధమూ లేదని హెచ్‌ఎంఆర్‌ఎల్‌ చెప్పడాన్ని హెచ్‌సిఎఫ్‌ ఖండిస్తున్నదన్నారు. ప్రజలు, ప్రజా సంఘాల నుంచి వస్తున్న విజ్ఞప్తులను ఎల్‌అండ్‌టి సంస్థ కనీసం వినేందుకు సిద్ధపడకపోవడం దారుణమన్నారు. వెంటనే మెట్రో ఛార్జీల పెంపు ప్రతిపాదన ఉపసహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌సిఎఫ్‌ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు మల్లం రమేష్‌, పి.శ్రీనివాసరావు, రమేష్‌, సుకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.



ముగ్గురు మంత్రులున్నా ధాన్యం కొనట్లేదు

- స్థానిక సంస్థల ఎన్నికల్లో దిమ్మతిరిగేలా షాకివ్వాలి
- శేషగిరిరావు విగ్రహావిష్కరణ సభలో కెటిఆర్‌

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

రేవంత్‌రెడ్డి లాంటి దివాళాకోరు ముఖ్యమంత్రి మరొకరు లేరని బిఆర్‌ఎస్‌ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి తమను ఓ దొంగలా చూస్తున్నారని మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండి ఏమి ఉపయోగమని, కనీసం ధాన్యం కూడా కొనుగోలు చేయలేని స్థితి ఉందని ఆరోపించారు. బాండ్‌ పేపర్లు రాసి ఎన్నికల్లో గెలిచిన భట్టి విక్రమార్క ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన డిసిఎంఎస్‌ మాజీ చైర్మన్‌ రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని శుక్రవారం కెటిఆర్‌ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థికంగా లోటు ఉందని ఉన్న స్కీములను ఎత్తివేసిన ప్రభుత్వం కొత్త పథకాలు ఎలా అమలు చేస్తుందని ప్రశ్నించారు. కెసిఆర్‌ కిట్టు, రైతుబంధు, రుణమాఫీ, పింఛన్ల పెంపు ఇలా ఎన్నో పథకాలు ఆగిపోయాయన్నారు. మార్పు కోసం తెచ్చుకున్న కాంగ్రెస్‌ ప్రభుత్వంలో ఎలాంటి మార్పు వచ్చిందో ప్రజలు గమనించాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు దిమ్మతిరిగే షాక్‌ ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఎన్నికల్లో బిఆర్‌ఎస్‌ను గెలిపించి ప్రభుత్వ వ్యతిరేకత చాటాలన్నారు. భద్రాచలంలో శాసనసభ స్థానానికి ఉప ఎన్నిక తప్పదన్నారు. గెలిపించుకునేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. రాజ్యసభ ఎంపి వద్దిరాజు రవిచంద్ర, బిఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాత మధుసూదన్‌, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జవాన్‌ మురళి నాయక్‌ మృతికి సిఎం దిగ్భ్రాంతి

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

జవాన్‌ మురళి నాయక్‌ వీర మరణం పట్ల సిఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ముఖ్యమంత్రి ఎక్స్‌ వేదికగా ట్వీట్‌ చేశారు. జవాన్‌ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వీరజవాన్‌ మురళీనాయక్‌ మరణం చాలా బాధాకరమని టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మరణం పట్ల సంతాపం తెలిపారు. దేశం కోసం ప్రాణాలర్పించిన ఆయన త్యాగం మరువలేనిదని పేర్కొన్నారు.

నేషనల్‌ డిఫెన్స్‌ ఫండ్‌కు సిఎం విరాళం

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

దేశ సరిహద్దులను, ప్రజలను రక్షించే క్రమంలో ఉగ్రవాదాన్ని నిర్మూలించేందుకు భారత సాయుధ దళాలు వీరోచితంగా పోరాడుతున్నాయని సీఎం రేవంత్‌ రెడ్డి కొనియాడారు. భారతీయునిగా తన ఒక నెల జీతాన్ని నేషనల్‌ డిఫెన్స్‌ ఫండ్‌కు విరాళంగా ఇవ్వనున్నట్టు శుక్రవారం ఎక్స్‌ వేదికగా ట్వీట్‌ చేశారు. ప్రభుత్వంలో, పార్టీలో తన సహచరులు, పౌరులు విరాళాలిచ్చేందుకు కదలాలని కోరారు. భారత సైన్యంతో ఈ సమయంలో మనమంతా ఒక్కటిగా నిలబడాలని పిలుపునిచ్చారు.

నేషనల్‌ డిఫెన్స్‌ ఫండ్‌కు ఒక రోజు వేతనం

- రాష్ట్ర సివిల్‌ సర్వీసెస్‌ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్‌

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

నేషనల్‌ డిఫెన్స్‌ ఫండ్‌కు ఒక రోజు వేతనం తెలంగాణ రాష్ట్ర సివిల్‌ సర్వీసెస్‌ డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్‌ తెలిపింది. ఈ మేరకు శుక్రవారం అసోసియేషన్‌ అధ్యక్షులు కె.చంద్రమోహన్‌, ప్రధాన కార్యదర్శి ఎ భాస్కర్‌ రావు ఒక ప్రకటన విడుదల చేశారు. దేశ భద్రతకు అంకితమైన మన సైనిక బలగాలు పాకిస్తాన్‌లోని ఉగ్రవాద శిబిరాలపై సాహసోపేతంగా ఆపరేషన్‌ సిందూర్‌ నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో వారి సేవా నిరతికి ఉడతా భక్తిగా, సిఎం రేవంత్‌ రెడ్డి నాయకత్వం, మార్గదర్శనంలో తమ ఒకరోజు వేతనాన్ని ఇవ్వాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. దేశభక్తిని ప్రేరణగా చేసుకుని, సైనికుల పట్ల గౌరవ భావంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వానికి ఈ మేరకు అధికారికంగా లేఖను అందించనున్నట్టు వారు తెలిపారు.

ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు

ప్రజాశక్తి -హైదరాబాద్‌ బ్యూరో

సరిహద్దు రాష్ట్రాల్లోని తెలంగాణవాసుల కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో కంట్రోల్‌ రూమ్‌ ఏర్పాటు చేశారు. అంతర్జాతీయ సరిహద్దులో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సరిహద్దు రాష్ట్రాల్లో నివసిస్తున్న, చిక్కుకున్న తెలంగాణవాసులకు సకాలంలో సహాయం, సమాచారం, సేవలను ఈ కంట్రోల్‌ రూం అందించనుంది. నిరంతరాయంగా సేవల కోసం ఈ కంట్రోల్‌ రూమ్‌ 24 గంటలు పని చేస్తుంది. వివరాలకు ల్యాండ్‌లైన్‌: 011-23380556, వందన, రెసిడెంట్‌ కమిషనర్‌ ప్రయివేట్‌ సెక్రటరీ, లైజన్‌ హెడ్‌- 9871999044, హైదర్‌ అలీ నక్వీ, రెసిడెంట్‌ కమిషనర్‌ వ్యక్తిగత సహాయకుడు - 9971387500, జి.రక్షిత్‌ నాయక్‌, లైజన్‌ ఆఫీసర్‌-9643723157, సిహెచ్‌ చక్రవర్తి, పబ్లిక్‌ రిలేషన్‌ ఆఫీసర్‌-9949351270 నెంబర్లలో సంప్రదించవచ్చని ఢిల్లీలోని తెలంగాణ భవన్‌ రెసిడెంట్‌ కమిషనర్‌ డాక్టర్‌ గౌరవ్‌ ఉప్పల్‌ తెలిపారు.

భూముల కబ్జాపై దళితుల ఆగ్రహం

- మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌ రెడ్డి కబ్జా చేశారంటూ ఆందోళన
- అధికారులు ఆయనకే వత్తాసు పలుకుతున్నారని ఆవేదన



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న దళితులు

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

తాత ముత్తాతల కాలం నుంచి భూములను నమ్ముకొని బతుకుతుంటే డబ్బున్న మారాజులు వచ్చి తమ భూములకే ఎసరు పెడుతున్నారని దళితులు ఆగ్రహం వ్యక్తం చేసిన సంఘటన మెదక్‌ జిల్లా శివ్వంపేట మండలంలోని చిన్నగొట్టిముక్కుల గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. దళితుల భూముల్లోకి ఉన్న రోడ్డును సైతం మాజీ ఎమ్మెల్యే కొనుగోలు చేసిన భూముల్లోకి కలుపుకునేందుకు తవ్వుతుండగా బాధితులు అడ్డుకున్నారు. దాంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ రెవెన్యూ శివారులోని సర్వే నెంబర్‌ 292లో దళితులకు వ్యవసాయ భూములున్నాయి. దళితుల వ్యవసాయ భూములను ఆనుకొని ఉన్న భూములను ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లా ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌ రెడ్డి కొనుగోలు చేశారు. ఈ భూముల విషయంలో గతంలోనూ దళితులకు, ఏనుగు రవీందర్‌ రెడ్డికి గొడవలు కూడా జరిగాయి. అప్పటి నుంచి ఎన్నోసార్లు భూముల కొలతలు చేయకుండా దళితులు అడ్డుకోగా రెవెన్యూ అధికారులు, పోలీసుల జోక్యంతో వివాదాన్ని కొంత నిలువరించగలిగినప్పటికీ, సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. దళితులు తమ భూములకు వెళ్లేందుకు ఏర్పాటు చేసుకున్న రోడ్డును సైతం అధికారులు, సర్వేయర్‌ కొలతలలోకి తీసుకోగా అందుకు దళితులు అభ్యంతరం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌ రెడ్డి అనుచరులతో కలిసి చిన్నగొట్టిముక్కుల గ్రామానికి చెందిన సివిల్‌ కాంట్రాక్టర్‌ కొడుకు భూములు కొనుగోలు చేసినట్టు, రోడ్డు కూడా మాజీ ఎమ్మెల్యే భూమిలో నుండే ఉందన్నట్టు రియల్‌ వ్యాపారులతో కలిసి ఎడి, సర్వేయర్‌ అన్యాయంగా రోడ్డును కొలతల్లోకి తీసుకున్నారు. రియల్‌ వ్యాపారులు హిటాచి సహాయంతో రోడ్డును తవ్వేసేందుకు యత్నించగా దళితులు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ కమలాద్రి అక్కడకు చేరుకుని ఇరువర్గాలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌ఐ మధుకర్‌ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్‌ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్‌ కిషన్‌, మాజీ ఎంపిటిసి నువ్వుల దశరథ, పాపయ్య చారి, చంద్రయ్య, శంకరయ్య, స్వామి, అశోక్‌, లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఒకే గొడుగు కింద అన్ని సేవలు

ప్రజలకు మెరుగైన సేవల కోసం 'మై జిహెచ్‌ఎంసి యాప్‌'

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

హైదరాబాద్‌ నగర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు జిహెచ్‌ఎంసి మరో అడుగు ముందుకేసింది. ప్రజల అవసరాలు తీర్చేందుకు 'మై జిహెచ్‌ఎంసి' యాప్‌ అందుబాటులోకి తీసు కొచ్చింది. సమస్యల పరిష్కారంతోపాటు అవసరమైన సేవలు పొందేందుకు యాప్‌ ఎంతో ఉపయోగకరంగా ఉండనుంది.



ఈ యాప్‌ ద్వారా శానిటేషన్‌, ఇంజినీరింగ్‌, హెల్త్‌, స్ట్రీట్‌ లైట్‌, రోడ్స్‌, డ్రెయిన్‌ క్లీనింగ్‌, రోడ్‌ స్వీపింగ్‌ సమస్యలపై ఫొటోగ్రాఫ్‌తో పాటుగా జియో లొకేషన్‌ ద్వారా ఫిర్యాదు చేస్తే డైరెక్ట్‌గా పరిష్కారం కోసం సంబంధిత అధికారికి చేరుకుంటుంది. అనంతరం తమ సమస్య పరిష్కారం అయిందో లేదో తెలుసుకోవడానికి చెక్‌ చేసుకునే వెసులుబాటుతోపాటు ఫీడ్‌ బ్యాక్‌ సబ్మిట్‌ చేసుకోవచ్చు. ఈ యాప్‌ ద్వారా గ్రేటర్‌ ప్రజలు మరిన్ని సేవలను పొందొచ్చు. ట్రేడ్‌ లైసెన్స్‌, ప్రాపర్టీ ట్యాక్స్‌, భవన నిర్మాణ వ్యర్థాల తొలగింపు కోసం వెహికిల్‌ బుకింగ్‌ తదితర పనుల కోసం సింగిల్‌ క్లిక్‌ ద్వారా చేసుకోవచ్చు. క్రెడిట్‌, డెబిట్‌ కార్డు, యూపీఐ ద్వారా పేమెంట్‌ చేసుకునే అవకాశం కూడా ఈ యాప్‌ ద్వారా కల్పించారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయాల లోకేషన్‌, వెదర్‌ అలెర్ట్‌లతోపాటు ప్రజలకు అవసరమైన ఎన్నో సేవలు పొందొచ్చు.

ఏదైనా, ఎక్కడైనా స్టేటస్‌ చెక్‌ చేసుకోవచ్చు: కమిషనర్‌

'మై జిహెచ్‌ఎంసి' యాప్‌ను ఆండ్రాయిడ్‌, ఐఓఎస్‌ మొబైల్‌లోని ప్లే స్టోర్‌ ద్వారా డౌన్‌లోడ్‌ చేసుకొని సమస్యల పరిష్కారం, సేవలు పొందొచ్చునని జిహెచ్‌ఎంసి కమిషనర్‌ ఆర్‌వి కర్ణన్‌ తెలిపారు. ఫొటో క్లిక్‌ ద్వారా మీ సమస్యను పంపొచ్చని, సమస్య పరిష్కారం స్టేటస్‌ను ట్రాక్‌ చేసుకొని ఏదైనా, ఎక్కడైనా స్టేటస్‌ను చెక్‌ చేసుకోవచ్చని అన్నారు. లొకేట్‌ వార్డు ఆఫీస్‌ ఆప్షన్‌లోకి వెళ్తే జిహెచ్‌ఎంసి ఆఫీస్‌ల లొకేషన్‌ తెలుసుకోవచ్చన్నారు. నగరవాసులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు.

ఫీ'జులుం'

- హైదరాబాద్‌లో ఓ ప్రయివేటు పాఠశాల బరితెగింపు
- సకాలంలో ఫీజు చెల్లించకుంటే రోజుకు రూ.20 జరిమానా



ప్రజాశక్తి -హైదరాబాద్‌ బ్యూరో

హైదరాబాద్‌లోని హిమాయత్‌నగర్‌లో ఓ ప్రయివేటు పాఠశాల యాజమాన్యం వింత నిర్ణయం తీసుకుంది. ఫీజుల వసూలు కోసం తల్లిదండ్రులపై జులుం ప్రదర్శిస్తున్నది. 2025-26 విద్యాసంవత్సరం ఫీజులను ఇప్పుడే కట్టాలని తల్లిదండ్రులపై ఒత్తిడి పెంచుతున్నది. యాజమాన్యం చెప్పిన తేదీలోగా ఫీజు కట్టకుంటే జరిమానా (ఫైన్‌) చెల్లించాలని హుకుం జారీ చేసింది. ఈ నిర్ణయంతో తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. యాజమాన్యం తీరును తీవ్రంగా వ్యతిరేకించారు. అయినా ఆ ప్రయివేటు పాఠశాల యాజమాన్యం తీరులో మార్పు రాలేదు. ఇంకా జరిమానాతోనే ఫీజులను తీసుకుంటుండడం గమనార్హం.హిమాయత్‌నగర్‌ ప్రాంతంలో ఓ ప్రయివేటు పాఠశాల ఉన్నది. సెంట్రల్‌ బోర్డ్‌ ఆఫ్‌ సెకండరీ ఎడ్యుకేషన్‌ (సిబిఎస్‌ఈ)తోపాటు సెకండరీ స్కూల్‌ సర్టిఫికెట్‌ (ఎస్‌ఎస్‌సీ) విద్యార్థులు చదువుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 28 నుంచి మార్చి 12 వరకు ఆ పాఠశాలలోని సిబిఎస్‌ఈ విద్యార్థులకు వార్షిక పరీక్షలను నిర్వహించారు. మార్చి 13 నుంచి 19 వరకు విద్యార్థులకు తాత్కాలిక సెలవులిచ్చారు. అదేనెల 20 నుంచి 2025-26 కొత్త విద్యాసంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. గత విద్యాసంవత్సరంలో ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.66 వేలు ఉన్న ఫీజును ప్రస్తుత విద్యాసంవత్సరంలో రూ.68 వేలకు పెంచారు. ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.68 వేలు ఉన్న ఫీజును రూ.70 వేలకు పెంచారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైన నాలుగు రోజుల్లోనే అంటే మార్చి 24న ఫీజు సర్క్యులర్‌ను ఆ పాఠశాల యాజమాన్యం జారీ చేసింది. మొదటి టర్మ్‌ ఫీజు ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.23 వేలు, ఆరు నుంచి పదో తరగతి వరకు రూ.24 వేలు ఏప్రిల్‌ 15 నాటికి చెల్లించాలని కోరింది. కేవలం 23 రోజుల్లో మొదటి టర్మ్‌ ఫీజును కట్టాలని ఆదేశాలు జారీ చేసింది. రెండో టర్మ్‌ ఫీజు ఆగస్టు 15 నాటికి, మూడో టర్మ్‌ ఫీజు డిసెంబర్‌ 15 నాటికి కట్టాలని తెలిపింది. ఒకవేళ ఆయా తేదీల నాటికి చెల్లించకుంటే రోజుకు రూ.20 జరిమానా (ఫైన్‌) కట్టాలని ఆదేశించింది. ప్రతిరోజూ గుర్తు చేస్తున్నది. ఉపాధ్యాయులతో ఫోన్‌ చేయించి తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తున్నది.

ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ఫీజులను చెల్లించాలంటూ తల్లిదండ్రులను వేధిస్తున్న పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్‌ (ఎస్‌ఎఫ్‌ఐ) హైదరాబాద్‌ జిల్లా కమిటీ డిమాండ్‌ చేసింది. ఏప్రిల్‌ 15 నాటికే మొదటి టర్మ్‌ ఫీజు చెల్లించాలంటూ తల్లిదండ్రులకు నోటీసులివ్వడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు లెనిన్‌ గువేరా, కార్యదర్శి కె అశోక్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌ డిఇఒ, విద్యాశాఖాధికారులు ఈ అంశంపై జోక్యం చేసుకుని ఆ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. లేదంటే ఆ పాఠశాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మనువాద సిద్ధాంతాలకు బిజెపి ప్రోత్సాహం

- వాటికి వ్యతిరేకంగా ఐడియాలజికల్‌ ప్రజా ఉద్యమాలు జరగాలి : వాసుకి

ప్రజాశక్తి - హైదరాబాద్‌ బ్యూరో

బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌ కార్పొరేట్‌ అనుకూల, మనువాద సిద్ధంతాలను ప్రోత్సహిస్తున్నాయని ఎఐడిడబ్ల్యూఎ ఉపాధ్యక్షురాలు, సిపిఎం పొలిట్‌ బ్యూరో సభ్యులు వాసుకి విమర్శించారు. ఆ సిద్ధాంతాలకు వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు కూడా ఐడియాలజికల్‌ స్థాయిలో జరగాలని ఆమె సూచించారు. పోరాడుతున్న వారే గెలుస్తారని ఆమె తెలిపారు. కేరళ రాష్ట్రం మలప్పురం జిల్లా ఎంఎస్‌ఎం అకాడమీ వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించనున్న అఖిల భారత మహిళా వ్యవసాయ, గ్రామీణ కార్మికుల మహాసభ శుక్రవారం ఉదయం ఘనంగా ప్రారంభమైంది. ప్రారంభ వేడుకల్లో రాజస్థాన్‌ రాష్ట్ర కార్యదర్శి, కేంద్ర కార్యవర్గ సభ్యురాలు దుర్గా స్వామి జెండా ఆవిష్కరించారు. అనంతరం అమరుల స్మారక స్థంభానికి పుష్పాంజలి ఘటించారు. వీరులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అఖిల భారత అధ్యక్షులు ఎ విజయ రాఘవన్‌, కార్యదర్శి బి వెంకట్‌ తదితరులు పాల్గొన్నారు. మహాసభను వాసుకి ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడిని తీవ్రంగా ఖండించారు. దేశ ప్రజలంతా ఒక్కటిగా ఈ దాడిని ఖండిస్తున్న తరుణంలో కొందరు శక్తులు మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజల ఐక్యత అత్యంత కీలకమని, సామాజిక ఐక్యతే సమాజాన్ని రక్షించగలదని సూచించారు.

మహిళా వ్యవసాయ కార్మికులు అనేక కష్టాలను ఎదుర్కొంటున్నారని ఉ.వాసుకి ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగం కోల్పోయే భయం, ఆర్థిక అసమానతలు, జెండర్‌ వేతన వ్యత్యాసం, గృహాల్లో వేతనం లేకుండా చేసే పనికి గుర్తింపు లేకపోవడం, ఆధార్‌ ఆధారిత వేతన చెల్లింపుల్లో లోపాలు వారిని కుంగదీస్తున్నాయని చెప్పారు. ఆరోగ్య పరిరక్షణ లోపాలు, గర్భధారణ, ప్రసవ సమయంలో సరైన పింఛను లేకపోవడం, తగిన వైద్య సేవలు అందని పరిస్థితులతో వారు సతమతమవుతున్నాయని తెలిపారు. మహిళలు శారీరకంగా వ్యవసాయ పనిలో పురుషులతో సమానంగా శ్రమిస్తున్నప్పటికీ, కార్మికురాలిగా, తక్కువ జాతి వ్యక్తిగా, మహిళగా సామాజికంగా మూడు స్థాయిల్లో అణచివేతను ఎదుర్కొంటున్నారని ఆమె వివరించారు. ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ వంటి చట్టాల ద్వారా వామపక్షాలు పోరాడి సాధించిన సమాన వేతన హక్కును ఆమె ప్రస్తావిస్తూ, అలాంటి చట్టాలను ప్రజా ఉద్యమాల ద్వారానే సాధించవచ్చునన్న నమ్మకాన్ని వ్యక్తం చేశారు.

మహాసభ నడిపించేందుకు ప్రెసిడియం సభ్యులుగా కొమల కుమారి, బోన్యా టుడ్డు, బి.పద్మ, ఎస్‌.పూన్గోతై, సరితా శర్మా, దుర్గా స్వామి, జిషా శ్యామ్‌ ఎన్నికయ్యారు. అంతర్గత కార్యకలాపాల్లో భాగంగా ఎస్‌.పూన్గోతై పలు సంతాప తీర్మానాలను ప్రవేశపెట్టారు. వీటిలో సీతారాం యేచూరి, బుద్ధదేవ్‌ భట్టాచార్య, కొడియేరి బాలకృష్ణన్‌, మళ్ళు స్వరాజ్యం, అంబికా ప్రసాద్‌ మిశ్రా, మధుసూదన్‌ రావు తదితర ప్రముఖుల మరణాలపై సంతాపం తెలిపింది. అలాగే గృహ, లైంగిక, కుల, మత హింస బాధితులు, పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వారు, పాలస్తీనా ప్రజల పోరాటంలో ప్రాణాలు కోల్పోయినవారు, ఉక్రెయిన్‌ యుద్ధంలో మరణించినవారికి నివాళులర్పించింది. ఈ మహాసభలో దేశవ్యాప్తంగా 400 మందికిపైగా ప్రతినిధులు పాల్గొంటున్నారు. చర్చించబోయే డ్రాఫ్ట్‌ తీర్మానం ఆధారంగా, వారి ప్రాంతీయ అనుభవాలు పరస్పరం పంచుకుని, మహిళా వ్యవసాయ కార్మికుల సమస్యలను లోతుగా విశ్లేషించి, భవిష్యత్‌ ఉద్యమానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలన్నదే మహాసభ ప్రధాన లక్ష్యం.